

# అసమర్థుని సమస్యా పరిష్కారం

ఎప్పటినుండో వేధిస్తున్న సమస్యకు పరిష్కారం ఆలోచిస్తూ కూర్చున్నాడు భాస్కరం. ఇది మమత వల్ల ఉద్భవించిన సమస్యగాని ద్వేషం వల్ల కాదు. తన అసమర్థత, నిస్సహాయత, తిరుగుబాటు చేసిన ఆర్థిక స్థోమతు ఇవి విశ్వరూపంగా భూతద్దం లోంచి చూసిన వస్తువుల్లా పెంచేశాయి సమస్యను.

వారివాలని కేతం, బ్రతకలేక బ్రతుకుతున్న జీవితం మధ్య కూలి పోతున్న ఆశాసౌధాలు ఒక వైపు, ఎవరినైతే సుఖపెట్టాలని, ఏ లోటు లేకుండా చూసుకోవాలని కాంక్షించాడో వాళ్ళే తన ఎదుట కష్టాలలో భాగం పంచుకోడం రెండో వైపు క్షోభ పెడుతూంటే జీవితంమీద విరక్తి పుట్టుకు వస్తోంది. బంజరు భూమి లాంటి సంసారాన్ని ఏ నాటికైనా సస్యశ్యామలం చేసుకోవచ్చునే ఆశ ఈ విరక్తినుండి విముక్తుణ్ణి చేస్తున్నది.

కొంత ఈర్ష్య పేరుకుంది. భాస్కరం కూడా ఈ సంగతి గ్రహించకుండా ఉండలేదు.

అమ్మ సుఖం కోసం తయారు చేసిన పథకాన్ని పదిహేను రోజులనుండి ప్రయోగిస్తున్నాడు భాస్కరం. అమ్మతో ముభావంగా ఉన్నాడు. అత్తా కోడళ్లల్లో ఏదైనా ఘర్షణ జరిగితే, తల్లినే గట్టిగామందలించాడు భాస్కరం భర్తలో వస్తున్న మార్పు చూసి సంతోషించింది నీరజ.

ఒక రోజు వంటింట్లో గిన్నెల చప్పుడౌతే, నీరజ వెళ్లి చూసింది. తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. పిల్లి పాలగిన్నె పడేసి, నేలమీద పార్లు తున్న పాలను తాగుతూంది. నీరజకు కష్టం వేసింది. దుఃఖం పొర్లుకు వచ్చింది. కోపం పట్టలేక కామాక్షమ్మని ఈసడించుకుంది.

"వంటింటి తలుపు కాస్త వెయ్యమని చెప్పానా? అంత నిర్లక్ష్యం దేనికి?" కోపంతో కళ్లెర్ర జేసింది నీరజ.

"ఆ పని నువ్వు చెయ్యలేక పోయావా?" అమ్మకూడా గట్టిగానే మాట్లాడింది.

"మీరు ఎంతకూ వంటింట్లోంచి ఊడిపడకపోతే ఎంతసేపని కనిపెట్టు కుండాలి? ఇంట్లో ఉన్నందుకైనా ఇంటి మంచిచెడ్డలు చూడక్కర్లేదా? సంపాదించే వాళ్లకు తెలుస్తాయి కష్టనష్టాలు. . ."

"అవమ్మా, నేను హాయిగా కూర్చుని మీ ఆయన సంపాదనంతా మింగేస్తున్నాను" అమ్మ ఉక్రోషంగా అంది.

"ఎందుకమ్మా, అలా విసుక్కుంటావు? నీరజ చెప్పిందాంట్లో తప్పేముంది? వచ్చేటప్పుడు తలుపు దగ్గిర వేసేస్తే ఇలా జరిగి ఉండేదా? మగవాడు ఎంత కష్టపడి సంపాదిస్తున్నాడో ఇంట్లో కూర్చున్న నీ కేం తెలుస్తుంది? నాన్నగారు వదిలి వెళ్లిన ఆస్తి ఏమైనా వెనకేసుకుని ఉన్నానను కుంటున్నావా? చేసింది చాలక పైగా కోపతాపాలు!" కటువుగా అన్నాడు భాస్కరం.

అమ్మ మనసులో బాధ పడింది. పల్లెత్తుమాటకూడా పైకి అనలేదు. క్షోభపెట్టినా క్షమించగలదు అమ్మ. భాస్కరం ఆలోచనంకు అంతరాయం కలిగించింది కామాక్షమ్మ.

"సావిత్రి మెయిలుకు వస్తానంది. స్టేషన్‌కు వెళ్లకూడదూ?" బాగు చేసిన బియ్యం తీసుకువెళుతూ భాస్కరాన్ని అడిగింది కామాక్షమ్మ.

నిర్లక్ష్యంగా తల్లివైపు చూసి, అయిష్టంగా బయలుదేరాడు భాస్కరం.

భాస్కరంలో కలిగిన మార్పు గ్రహించలేనంత అవివేకురాలు కాదు కామాక్షమ్మ. కొడుకు ముభావంగా ఉండడం, భార్యను వెనకేసుకు వచ్చి అకారణంగా మందలించడం గమనించిన కామాక్షమ్మకు బాధగానే ఉంది. కాని దీనికంతకు మూలకారణమేమిటో ఆమె బోధపడలేదు. కారుమేఘాలు కమ్ము కుంటున్నాయి. జీవితంలో అనుకుంది కామాక్షమ్మ.

* * *

సావిత్రి వస్తూనే అమ్మను చుట్టుకుంది. కామాక్షమ్మ ముఖంలో పూర్వపు కళ లేదు. కళ్లలో కాంతి లేదు. విచారగ్రస్తలా ఉన్న అమ్మను విస్మయంగా చూసింది సావిత్రి.

"ఏమిటమ్మా అలాగున్నావు? ఒంట్లో బాగుండడం లేదా? చూడు ఎలా నీరసించి పోయావో" ప్రేమతో ఆదరంగా పరామర్శించింది సావిత్రి తల్లిని.

చల్లటిగాలి తగిలిన మేనులా సావిత్రి ప్రియవాక్కులకు కామాక్షమ్మ కళ్లు వర్షించాయి.

"నాకేమైందమ్మా?... నిక్షేపంలా ఉన్నాను. ముసలిదాన్నయి పోతున్నాను గదా, అందువల్లే ఈ నీరసం" అని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది కామాక్షమ్మ.

తల్లిమాటలు కృత్రిమంగా తోచాయి. ఏదో మనోవ్యథతో కృంగి పోతూందన్న సంగతి గ్రహించి, నిజం తెలియకపోదులే అని ఊరుకుంది సావిత్రి.

నీరజ పూర్వంకన్నా ఇప్పుడు బాగుంది. సంతోషంగా, ఏమీ పట్టనట్టుంటుంది. భాస్కరం మాత్రం పరాకుగా ఉంటూ దేనికో బాధపడు తున్నట్లనిపించింది సావిత్రికి.

తల్లిని దూరం చేసుకుంటున్న తమ్ముణ్ణి అర్థం చేసుకోటాని కెంతో కాలం పట్టలేదు. నీరజ నిర్లక్ష్యం, భాస్కరం ముభావం తల్లి మానసిక క్షోభకు కారణం. ఓర్పుతో అన్నీ సహిస్తూ ఎదురు తిరగని కామాక్షమ్మ అంటే సావిత్రికు జాలి. ఇంత జరుగుతున్నా నోరు విప్పి కామాక్షమ్మ చెప్పుకోకపోవడం సావిత్రికి బాధ కలిగించింది. అవకాశం లభించినప్పుడు తమ్ముణ్ణి మందలించా లనుకుంది.

సాయంత్రం కాఫీ తాగి, గాజుగ్లాసు గోడవారపెట్టి సావిత్రితో కబుర్లు చెబుతూంది కామాక్షమ్మ. నీరజ భాస్కరం కోసం కాఫీ కలుపుతూంది. ఆడుకుంటున్న రవి బాజాల చప్పుడు విని వీధిలోకి పరుగు తీశాడు. ఆ తొందరలో గాజుగ్లాసును తన్ను కుంటూ పోయాడు. గ్లాసు దొర్లు కుంటూ వెళ్లి గోడను ఢీకొని ముక్కలైంది.

శబ్దానికి ఇవతలికి వచ్చిన నీరజ గ్లాసు బద్దలవడం చూసి ముఖం చిట్లించింది.

"ఏ ముస్నా ఈ కొంపలో నాశనం కావడమే గాని, నాలుగు కాలాలపాటు ఉంటుందన్న ఆశే లేదు. కాఫీ తాగిన వాళ్లకు గ్లాసు జాగ్రత్త చేయాలనే జ్ఞానమే లేదు." కోపంతో రుసరుస లాడింది నీరజ.

తల్లి నోరు మెదపక పోవడం సావిత్రికి చిరాకు కలిగించింది.

"ఇన్నాళ్లకు నువ్వు జ్ఞానం బోధించ డానికి వచ్చావమ్మా! పశువుల్లా బ్రతికిన మాకు, మంచిచెడ్డలు ఏం తెలుస్తాయి? నువ్వు నేర్పిస్తే నేర్చుకుందామని మా అమ్మ మీ ఇంట్లో పడి ఉంటూంది." ఆడపడుచు మాటలకు అదిరిపడింది నీరజ.

"దాని వస్తువుపోతే, కష్టంతోచి రెండు మాటలంటే, దాన్ని పట్టుకుని అలా దుయ్యపడతారా? ఛ,ఛ. మీ రంతా కలిసి ఇల్లు నరకం చేసేస్తున్నారు. ఇంట్లో ఒక్క క్షణం ఉండ బుద్ధి వెయ్యడం లేదు" భాస్కరం కోపంతో అరిచాడు.

"తల్లిని అంతేసి మాట అంటుంటే చేతకానివాడిలా నోరు మూసుకున్నదేకాక, పెళ్లాన్ని వెనకేసుకు వస్తున్నావురా? నిన్ను పెంచి ఇంతవాణ్ణి చేసినందుకు ప్రతిఫలం ఇదేరా?"

"ఎంతవాణ్ణి చేశారే?. . . గొప్ప చదువులు చదివించారా, పెద్ద ఉద్యోగం చేసుకుని బ్రతకడానికి?. . . పెద్ద, పెద్ద ఆస్తులు వదిలి వెళ్లారా, కాలు మీద కాలు వేసుకుని హాయిగా ఉండ డానికి?. . . ఇద్దరు ఆడపిల్లల కోసం, కొడుకుని దౌర్భాగ్యుణ్ణి చేసి, తల్లి భారాన్ని నెత్తికి రుద్దినందుకా ప్రతి ఫలం?"

"నోర్ముయ్యి. కన్నతల్లి నేడు నీకు భారమైందిరా? ఆ మాట ముందే తెలిసి ఉంటే ఆమె నీడకూడా, నీ మీద పడనిచ్చేదాన్ని కాదు. నీ కోసం, నీ సుఖం కోసం, నీ మీద ప్రేమతో మమ్మల్ని తిరస్కరించి నీ పంచన ఉంటుంటే నీవు ఇచ్చిన విలువ ఇదా? . . . దౌర్భాగ్యుడా! నీకు నోరు ఎలా వచ్చిందిరా? పశువుకంటే హీనమైపోయావురా."

"అమ్మా! పదవే. ఒక్క క్షణం ఈ ఇంట్లో ఉండడానికి వీలులేదు. వీణ్ణి వాడి పెళ్లాం, పిల్లలతో సుఖంగా ఏడ్వని" సావిత్రి గర్జనతో అందరూ నిశ్చేష్టు లయ్యారు.

"వెళ్లండి. మీ రందరూ కలిసి ఏ గంగలోనైనా కలవండి. ఇంటికి పట్టిన శని దూరమౌతుంది." భాస్కరం విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

తిరిగి, తిరిగి రాత్రి ఇంటికి చేరుకునేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

"అత్తయ్యగారు వెళ్లిపోయా రండి" అంది నీరజ పొర్లుకు వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ భయం, భయంగా.

"అవును, అమ్మ వెళ్లిపోయింది." ఆ మాట తలుచుకునేసరికి హృదయం దహించుకుపోతూంది. ఆ ప్యాలంలో వాత్సల్యం కురిపించే అమ్మలేదు.

'నిన్ను సుఖపెట్టలేక, నీ సుఖం కోసం, ఇంటినుండి వెడలగొట్టిన ఈ కొడుకును క్షమించమ్మా? ఇది అసమర్థుని సమస్యా పరిష్కారం!'

అంత విషాద సమయంలోను, దృష్టిలో నిండిన చిరునవ్వు వెలిగి హృదయాన్నంతా ఆక్రమించుకుంది. ★

---

## భూతకాలం

భూతకాలాన్ని ప్రియంగా పరిగణించేవారి పరిపాలనలోనున్న దేశం భవిష్యత్తు భద్రంగా ఉంటుంది.

—విలియమ్ గ్లాడ్‌స్టన్

## సహనం

సంతృప్తికి సహనం ఆధారం.

—మహాత్మా

మానవుని జీవితంలో ముఖ్యమైన మూడు అంశాలకు హేతువు లేదు – అవి పుట్టుక, పెళ్లి, చావులు.

—ఆస్టిన్ ఓ. మాలే